క్లుప్తంగా...

నేడు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి నూతన పోలీస్‌స్టేషన్‌ను గురువారం ప్రారంభించనున్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. ఉదయం 11.30 గంటలకు హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, విద్యా శాఖ మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. టీఎస్‌ఐపీసీ ఆధ్వర్యంలో 3.5 కోట్ల రూపాయలతో ఈ పోలీస్‌స్టేషన్‌ను నిర్మించారు. 18 వేల ఎస్ఎఫ్‌టీలో గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లో ఇన్‌స్పెక్టర్ చాంబర్‌తో పాటు ఎస్సై చాంబర్లు, డైనింగ్ హాల్, రెస్ట్ రూమ్‌లు, మీటింగ్ హాల్, బ్యారెక్‌లను నిర్మించారు. ఈ భవన ప్రారంభోత్సవానికి శాసన మండలి సభ్యులు డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి, శంభిపూర్ రాజు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హాజరవుతారన్నారు.

పీఆర్ కమిషనరేట్‌కు సూపరింటెండెంట్ సరెండర్

శంషాబాద్ రూరల్: మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ బి.ప్రతిభను పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు సరెండర్ చేశారు. ఇక్కడి అధికారులు, తోటి సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించినట్టు, మహిళా ప్రజాప్రతినిధికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై జిల్లా పరిషత్ సీఈఓ వివరణ కోరగా.. ఆమె ఇచ్చిన సమాధానం సైతం అధికారులను విస్మయానికి గురి చేసినట్లు సమాచారం. కాగా, నాలుగు రోజుల కిందట ఆమెను కమిషనరేట్‌కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమె స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

కర్ణాటక మాజీ మంత్రి గోపాలయ్య

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూంలు, రేషన్ కార్డులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని, అలాంటి వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి వివరించి ప్రతి పోలింగ్ బూత్‌లో 60 శాతం ఓట్లు బీజేపీకి వచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కర్ణాటక మాజీ మంత్రి కె. గోపాలయ్య అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని కేవీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ పి. మల్లేష్‌యాదవ్ అధ్యక్షతన ఎమ్మెల్యే ఆవాస్ కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ, ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వారు బీజేపీకి ఓటు వేసేలా చేయాలని పార్టీ నాయకులను కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రేమ్‌రాజ్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు టి.అంజన్‌కుమార్‌గౌడ్, కార్యక్రమం కోఆర్డినేటర్ వై శ్రీధర్, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, నాయకులు బుక్క వేణుగోపాల్, మహాలింగంగౌడ్, బి.శ్రీధర్, ఎం.నగేష్‌యాదవ్, మణికొండ, నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీల పార్టీ అధ్యక్షులు బీరప్ప, బిక్షపతియాదవ్, మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్‌కు దరఖాస్తు



మణికొండ: కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ టికెట్‌ను మణికొండ మున్సిపల్ చైర్మన్, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు కె.నరేందర్ ముదిరాజ్‌కు ఇవ్వాలని ఆయన అనుచరులు దరఖాస్తు చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.జితేందర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజల్లో చరిష్మా ఉన్న నాయకుడు నరేందర్ అని, అతడికి టికెట్ ఇస్తేనే గెలుపు అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కస్తూరి రాములు, శ్రీనివాస్‌రెడ్డి, ధనరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

గోల్కొండ: తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్‌లోని బంజావాడలో మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీలు ముందస్తుగానే అభ్యర్థులను ప్రకటిస్తున్నాయని అయితే అభ్యర్థుల ప్రకటన ప్రజలను మభ్యపెట్టడానికే అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని మినహాయిస్తే దేశంలోని ఇతర పార్టీలన్నీ అవినీతి ఊబిలో కూరుకుపోయి ఉన్నాయన్నారు.

'చంద్రయాన్-3' సంబురాలు



మణికొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చంద్రయాన్ గురించి వివరిస్తున్న ఎంప్లాయిస్ కాలనీ నాయకులు



ఎంజీఐటీ కళాశాలలో చంద్రునిపై ల్యాండర్ దిగడాన్ని వీక్షిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మణికొండ: ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతం కావడంతో గండిపేట మండల పరిధిలో ప్రజలు సంబురాలు జరుపుకున్నారు.మణికొండ క్వార్టర్స్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చంద్రయాన్-3 యొక్క విశిష్టతను స్థానిక ఎంప్లాయిస్ కాలనీ అసోసియేషన్ నాయకులు వివరించారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల, నార్సింగిలోని మైహోం అవతార్‌లలో చంద్రునిపై ఇస్రో పంపిన విక్రమ్ ల్యాండర్ దిగటాన్ని వీక్షించేందుకు లైవ్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రపంచ దేశాలలో చంద్రునిపై చంద్రునిపై విజయవంతంగా కాలుమోపిన నాలుగో దేశంగా, దక్షిణం వైపు దిగిన మొదటి దేశంగా భారత్ నిలవటంపై అనేక మంది ఆనందం వ్యక్తం చేశారు.

దేశం సాధిస్తున్న విజయాలకు నిదర్శనం: బండి

శంషాబాద్: భారత ప్రధాని నరేంద్రమోదీ పరిపాలనలో దేశం సాధిస్తున్న విజయాలకు చంద్రయాన్-3 ఒక నిదర్శనమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ చందమామపై దిగి విజయంగా దిగడంతో బుధవారం రాత్రి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద జరిగిన విజయోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఇస్రో సాధించిన విజయం దేశ ప్రగతిని ఇనుమడింపజేసిందన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కు స్థానిక నేతలు స్వీట్లు తినిపించారు. అనంతరం భారీ ఎత్తున బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యులు డాక్టర్ ప్రేమ్‌రాజ్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, సీనియర్ నాయకులు బుక్క వేణుగోపాల్, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కౌన్సిలర్ కొండ ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, శంషాబాద్ మాజీ సర్పంచ్ ఆర్. గణేష్ గుప్తా ఆధ్వర్యంలో చంద్రయాన్-3 విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. కౌన్సిలర్లు ఆయిల్ కుమార్, అజయ్, మేకల వెంకటేష్, నాజియా, నాయకులు మురళి, పాల్గొన్నారు.

'విక్రమ్' విజయవంతంపై హర్షం

శంషాబాద్: జాబిల్లిపై విజయవంతంగా విక్రమ్ ల్యాండర్ అడుగు పెట్టిన క్షణాలకు పట్టణ ప్రజలు ఉత్కంఠగా టీవీల్లో వీక్షించారు. పలు పాఠశాలలలో ప్రత్యేకంగా టీవీలు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు కూడా ఆ క్షణాలను ఆస్వాదించారు. చంద్రయాన్-3లో భాగంగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై తొలిసారి అడుగుపెట్టిన ఘనత భారత్ సాధించడంపై ఆనందోత్సాహాల్లో ప్రజలు మునిగిపోయారు.

ఇస్రోకు అభినందనలు



గతంలో ఏ దేశం సాధించని విజయం మనదేశం తరఫున ఇస్రో సాధించడం ఎంతో గర్వంగా ఉంది. చందమామపై విక్రమ్ ల్యాండర్ అడుగు పెడుతున్న సమయంలో టీవీలో ఉత్కంఠగా చూశాం. విజయవంతంగా అడుగు పెట్టిన క్షణాలను ఆనందంగా ఆస్వాదిస్తున్నాం. వైజ్ఞానిక రంగంలో భారత్‌కు తిరుగులేదని నిరూపించాం.

– పల్లాటి అంజనిశ్రీ, 6వ తరగతి,బృందావన్ కాలనీ

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



మేయర్ మహేందర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కమిషనర్ బి.శరత్‌చంద్రలను కలిసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం కమిటీ అధ్యక్షుడు ఎ.నరేందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఆర్.కిరణ్, జె.జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఆర్.సైదులు మాట్లాడుతూ, గత 20, 25 సంవత్సరాలుగా గ్రామ పంచాయతీలలో పని చేసే మున్సిపల్ కార్మికులను విలీనమైన బిల్‌కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, అటెండర్లు, ఎలక్ట్రిషియన్లు, జవాన్లు, వాటర్ లైన్‌మెన్లు, కామాటీలు, డ్రైవర్లు, స్వీపర్లు అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అర్హతను బట్టి ఉద్యోగాలును రెగ్యులరైజ్ చేయాలని, ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో చెల్లిస్తున్న వేతనాలు నేరుగా మున్సిపాలిటీ నుంచి ఉద్యోగుల అకౌంట్‌లలో జమ చేయాలన్నారు. రాబోయే కౌన్సిల్ సమావేశంలో తమ సమస్యలపై ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమోదం కోసం ఉన్నతాధికారులకు, సంబంధిత శాఖ మంత్రికి పంపి తమకు న్యాయం చేయాలన్నారు.

కమిటీ సభ్యులు వీరే...

ప్రెసిడెంట్‌గా ఆర్.కిరణ్, జె.జయప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.సైదులు, ట్రెజరర్‌గా పి.ఉమారాణి, జి.యాదగిరి, సెక్రటరీగా వై.పూర్ణ, వి.శివ(ఎలక్ట్రికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్), డి.వేణు(ఎలక్ట్రీషియన్), జాయింట్ సెక్రటరీ కె.మల్లేష్(జవాన్), కె.శ్రావన్(ఎలక్ట్రీషియన్), లీగల్ అడ్వైజర్ కె.ప్రవీణ్, అడ్వైజర్ ఎం.మహిపాల్‌రెడ్డి(బిల్ కలెక్టర్), ఎండీ నహీమ్(బిల్‌కలెక్టర్), ప్రచార కమిటీ పి.చంద్రశేఖర్(బిల్‌కలెక్టర్), బి.సుభాష్(జవాన్)ను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌ను ముట్టడించిన 'బీజేపీ'



ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్, పింఛన్లు, రేషన్ కార్డులను అందించాలంటూ బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడి చేపట్టారు. బీజేపీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వడంతో అర్ధరాత్రి నుంచే కార్పొరేటర్లతో పాటు నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా పోలీసులు గృహ నిర్బంధంతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. పలువురు నాయకులు పోలీసులకు చిక్కకుండా క్యాంపు కార్యాలయానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి బొక్క బాల్‌రెడ్డి, కార్పొరేటర్ భూపాల్‌గౌడ్, మహాలింగం గౌడ్‌లు మాట్లాడుతూ, ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందిస్తామని ఐదేళ్ల క్రితం ప్రకటించిందన్నారు. నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ఇప్పటి వరకు డబుల్ బెడ్‌రూమ్‌లు అందించలేదన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్‌రూమ్‌లు, పింఛన్లు, రేషన్ కార్డులు అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, అరెస్టు చేసిన నాయకులను పోలీసులు అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

రాందేవ్ బాబా ఆలయంలో యజ్ఞశాలకు భూమిపూజ

రాజేంద్రనగర్: భక్తుల సౌకర్యార్థం రాందేవ్ బాబా ఆలయాన్ని అధునాతన పద్ధతిలో అభివృద్ధి చేస్తామని రాందేవ్ బాబా దేవాలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. బుధవారం ఆరాంఘర్‌లోని రాందేవ్‌బాబా మందిరంలో రాందేవ్ బాబా జన్మదినం సెప్టెంబర్ 17 సందర్భంగా మహాయజ్ఞశాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ యజ్ఞంలో ప్రతి రోజు ఉదయం 108 మంది సాయంత్రం 108 మంది కూర్చొని యజ్ఞం చేసే విధంగా మహా మండపాన్ని నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇండోమెంట్ ఈఓ మోహన్‌రావు, మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్, ధర్మచంద్ జైన్, జగదీష్ అగర్వాల్, అమృత్‌కుమార్ జైన్, శ్యాంసుందర్ పర్థని, దినేష్, సురేష్ మహరాజ్, బన్వారీ మహరాజ్, రాకేష్‌మహరాజ్, అనిల్ మహరాజ్, పండిట్‌పురుషోత్తం, జి.శ్యామ్ మహరాజ్, జగన్నాథ్, పంకజ్, రాందేవ్ బాబా భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బైరాగిగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సన్‌సిటీ మెయిన్ రోడ్డు, రాధానగర్, లక్ష్మీనగర్, కె.కె.కన్వెన్షన్, రఘురామ్‌నగర్, నర్సారెడ్డి కాలనీ, సన్‌సిటీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గంధంగూడ, హిమగిరి కాలనీ, హైదర్షాకోట్ ఓల్డ్ విలేజ్, శాంతినగర్, గంధంగూడ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

ముదిరాజ్‌లను కేసీఆర్ అవమానిస్తున్నారు

సత్యనారాయణ ముదిరాజ్



రాజేంద్రనగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ముదిరాజ్‌లను రాజకీయంగా ఎదగనివ్వకుండా తొక్కుతోందని ముదిరాజ్ మహాసభ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు డి.సత్యనారాయణ ముదిరాజ్ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ తొలి జాబితాలో ముదిరాజ్‌లకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ అవమానించారన్నారు. బీసీ బంధులో కూడా ముదిరాజ్‌లను అవమానపరిచారన్నారు. ఈటల రాజేందర్ ఉద్యమంలో కేసీఆర్‌తోనే ఉండి ఉద్యమం చేశారన్నారు. అలాంటి ఈటలను కూడా ముదిరాజ్ అని పార్టీలో అవమానపరిచి బయటికి గెంటేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్‌ల సంఖ్య 60 లక్షలకుపైగా ఉన్నా అలాంటి ముదిరాజ్‌లకు ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడం కేసీఆర్‌కు ఎంత అహంకారం ఉందో అర్థమవుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ముదిరాజ్‌లంతా కలిసి కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు: మహిళ మృతి

శంషాబాద్ రూరల్: రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. మండలంలోని ఘాంసిమియాగూడ శివారులో బుధవారం ఈ ఘటన జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎ. శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి నందయ్య కుటుంబంతో కలిసి లింగంపల్లిలోని నల్లగడ్ల వద్ద ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. తన భార్య రాజేశ్వరి(56)తో కలిసి నందయ్య ఈ నెల 22న కారులో స్వగ్రామానికి వెళ్లాడు. బుధవారం తిరిగి హైదరాబాద్ వస్తూ మార్గం మధ్యలో బెంగళూరు జాతీయ రహదారిపై ఘాంసిమియాగూడ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం లారీ కిందకు దూసుకుపోయింది. కారు ముందు సీట్లో ఎడమ పక్కన కూర్చున్న రాజేశ్వరికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవింగ్ చేస్తున్న నందయ్యకు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాక్స్‌డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపండి: ఎమ్మెల్యే



పంచవటి కాలనీలో బాక్స్ డ్రైన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

మణికొండ: పంచవటి కాలనీలో రూ.10 కోట్ల ఎస్ఎన్‌డీపీ నిధులతో చేపట్టిన బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు నెక్నాంపూర్ చెరువు వరకు ఇదే తరహాలో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న బాక్స్ డ్రైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బాక్స్ డ్రైన్ పనులు పూర్తయితే పంచవటి కాలనీలో వరద ముంపు సమస్య పరిష్కారమవుతుందన్నారు. నెక్నాంపూర్ చెరువు వరకు బాక్స్ డ్రైన్ నిర్మాణం చేపడితే మురుగునీటి దుర్వాసన, వరద సమస్యలను నివారించవచ్చని, అందుకు అనుగుణంగా నివేదికలు ప్రభుత్వానికి పంపాలన్నారు. త్వరలోనే రాష్ట్ర పట్టణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి పూర్తి స్థాయి పనులకు అవసరమైన నిధులు వచ్చేలా తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, కౌన్సిలర్ నవీన్‌కుమార్, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డి.సీతారాం పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండ



దివ్యాంగుడికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. సమాజంలో దివ్యాంగులు మంచి గౌరవంతో జీవించాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్దేశమన్నారు. పట్టణంలోని వైఎన్ఆర్ గార్డెన్‌లో బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని 4017 మంది లబ్ధిదారులకు రూ. 3016 నుంచి 4016 పెరిగిన పింఛన్ ధ్రువ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ, దివ్యాంగులు ఆర్థిక అవసరాలను కొంతవరకైనా తీర్చే విధంగా ప్రభుత్వం వారి పింఛన్‌ను మానవతా దృక్పథంతో పెంచిందన్నారు. దివ్యాంగులు రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండి గోపాల్ యాదవ్, ఎంపీపీ జయమ్మ, నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి, కౌన్సిలర్లు మేకల వెంకటేష్ ముదిరాజ్, అజయ్, పుష్పలత, నాజియా, మసర్‌తజా సుల్తాన్‌పల్లి సర్పంచ్ దండు ఇస్తారి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను ఆదరించండి..

'పింఛన్లు రూ. 200 నుంచి 4 వేల వరకు పెరగడం ఎంతో సంతోషకరమైన విషయం.. ఇందుకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు మనం ఎప్పుడు సహకారంగా ఉండాలి. ఆయనను ఎప్పుడూ ఆదరించాలి'.. అంటూ బీజేపీ మండల అధ్యక్షుడు, పెద్దతూప్రా సర్పంచ్ చిటికెల వెంకటయ్య ప్రసంగించడం చర్చనీయాంశంగా మారింది. అయితే తాను ఎన్నికలను ఉద్దేశించి అలా అనలేదని, ఓటు వేయాలని చెప్పలేదని.. తన వ్యాఖ్యలకు అలాంటి అర్థం లేదని ఆయన తర్వాత మీడియాకు చెప్పుకొచ్చారు.

లోపాలు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలి

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా సక్రమంగా చేపట్టాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ రాధానగర్ కాలనీలో రూ. 28 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్‌తో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించి, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనులు ప్రజలకు నాలుగు కాలాల పాటు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పనులను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ప్రజలు సైతం అభివృద్ధి పనులకు సహకరించాలన్నారు. తమ ప్రాంతంలో జరుగుతున్న పనులను ప్రజలు కూడా పర్యవేక్షిస్తూ ఏమైనా లోపలు ఉంటే గుర్తించి తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విజయ్‌సేనారెడ్డి, శ్రీనివాస్, రాజుయాదవ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



గండిపేటలో నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ అందిస్తున్న వెంకటేశ్‌యాదవ్

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు దాతలు, సంస్థలు, సేవా సంస్థలు తమ వంతు చేయూనందించాల్సిన అవసరం ఎంతో ఉందని నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు స్థానిక గోల్కొండ రిసార్ట్ వారి ఆధ్వర్యంలో 306మంది విద్యార్థులకు అవసరమైన నోట్ బుక్స్, స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచిత డ్రస్‌లు, మధ్యాహ్న భోజనం, నోట్ పుస్తకాలు లాంటివి ఎన్నో అందిస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకుడు గోపాల గణేష్, గోల్కొండ రిసార్ట్ ఎండీ సురేష్‌రెడ్డి, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రమోద్ పాల్గొన్నారు.

అనిల్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే




అనిల్‌కుమార్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: చిత్ర పరిశ్రమ 24 క్రాఫ్టుల ఫెడరేషన్ అధ్యక్షుడు, చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ జన్మదినోత్సవం బుధవారం చిత్రపురిలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. చిత్రపరిశ్రమకు చెందిన అన్ని విభాగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే టి ప్రకాశ్‌గౌడ్ వేడుకలకు హాజరై అనిల్‌కుమార్‌తో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గండిపేట మండల మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు హైమాంజలి, వసంతరావు, బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.శ్రీరాములులతో పాటు పార్టీ నాయకులు, చిత్రపరిశ్రమ పలు విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, చిత్రపురి హౌసింగ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో అన్నదానం

లక్డీకాపూల్: అనిల్ కుమార్ వల్లభనేని పుట్టిన రోజు సందర్భంగా పంజగుట్ట నిమ్స్ ఆసుపత్రిలోని రోగులకు, సహాయకులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. జూనియర్ ఆర్టిస్ట్స్ ఏజెంట్స్ యూనియన్ సంయుక్త కార్యదర్శి చిలుకూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని మణికొండ కార్పొరేటర్ హైమాంజలి వల్లభనేని ప్రారంభించారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

శంషాబాద్: మరోసారి బీఆర్ఎస్ టికెట్‌తో రంగంలోకి దిగబోతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను పదకొండో వార్డు కౌన్సిలర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మరోసారి ప్రకాష్‌గౌడ్ భారీ మెజార్టీలో విజయం సాధించనున్నారని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ నేతలు కొండ పరమేష్‌గౌడ్, పెంటయ్య, సుదర్శన్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, విష్ణుగౌడ్, కుమార్, వినోద్, నిరంజన్, చంటి, సుక్కు, నందు, నాగరాజు, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.